నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | శనివారం 21 జూన్ 2025 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD


## మాదకద్రవ్యాలతో కలిగే నష్టంపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్, జూన్ 20 : విద్యార్థుల భవిష్యత్‌పై మాదక ద్రవ్యాల ప్రభావం పడకుండా చూడాలని, వాటితో కలిగే నష్టంపై అవగాహన కల్పించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో ఆయా శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల ఉత్పత్తి, రవాణా, విక్రయం, వినియోగాలను నిరోధించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. మాదక ద్రవ్యాలు, గంజాయి, మత్తు పదార్థాలు వినియోగించడం వల్ల కలిగే నష్టాల గురించి వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తూ అవగాహన కల్పించాలన్నారు. అనంతరం పోస్టర్లు విడుదల చేశారు. డీసీపీ భాస్కర్, డీఎఫ్‌వో శివ్‌ఆశీష్‌సింగ్, ఆర్డీవోలు శ్రీనివాసరావు, హరికృష్ణ, అబ్కారీ మద్య నిషేధ అధికారి నంద గోపాల్, ఏసీపీలు వెంకటేశ్వర్లు, రవికుమార్, మానసిక వైద్యుడు సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

## రామగుండం సీపీకి అవార్డు అందజేత



సీపీకి అవార్డు అందజేస్తున్న ఐఆర్‌సీ నిర్వాహకులు

మంచిర్యాల అర్బన్, జూన్ 20 : ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 14న రాష్ట్ర గవర్నర్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు జిష్టుదేవ్ వర్మ ప్రదానం చేసిన అవార్డును శుక్రవారం రామగుండం కమిషనరేట్‌లో కమిషనర్ అంబర్ కిషోర్ ఝా కు అందజేశారు. అనంతరం కమిషనరేట్ పరిధిలో రక్తదాన శిబిరాలు నిర్వహించాలని రెడ్ క్రాస్ నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో ఐఆర్‌సీ నిర్వాహకులు భాస్కర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, మహేందర్ పాల్గొన్నారు.



మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్‌తో మాట్లాడుతున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్



బీఆర్‌ఎస్‌వీ నాయకుడు మధు తల్లిని లాక్కెళ్తున్న మహిళా పోలీసులు



బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి పోలీస్‌స్టేషన్‌కు తరలి వెళ్తున్న మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు

# కాంగ్రెస్ గూండాయిజంపై భగ్గుమన్న బీఆర్ఎస్

**బీఆర్ఎస్వీ నాయకుడు దగ్గుల మధుపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలంటూ ఆందోళన**



బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నడిపెల్లి విజిత్ రావును లాక్కెళ్తున్న పోలీసులు

- బెల్లంపల్లి చౌరస్తాలో బాధిత కుటుంబ సభ్యులతో కలిసి ధర్నా
- శ్రేణుల అరెస్టుపై ఆగ్రహం.. పోలీస్‌స్టేషన్ వరకు ర్యాలీ.. బైఠాయింపు
- రౌడీలకు కొమ్ముకాస్తున్న పోలీసులను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్
- దాదాపు ఐదు గంటల పాటు కొనసాగిన ఆందోళన
- మధుపైనే ఉల్టా కేసు పెట్టడం దుర్మార్గం : మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్
- ఎమ్మెల్యే పీఎస్ఆర్ గూండాయిజాన్ని ప్రోత్సహిస్తున్నారు : మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు
- దాడులను తీవ్రంగా ఖండిస్తున్నాం : మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

మంచిర్యాల, జూన్ 20 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మంచిర్యాల జిల్లా కేంద్రంలో గురువారం రాత్రి బీఆర్ఎస్ విద్యార్థి విభాగం నాయకుడు దగ్గుల మధుపై కాంగ్రెస్ నాయకులు గూండాయిజం చేయడంపై బీఆర్ఎస్ భగ్గుమన్నది. మధుపై దాడి చేసిన రౌడీలను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టింది. శుక్రవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని బెల్లంపల్లి చౌరస్తాలో మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు, రాష్ట్ర నాయకుడు విజిత్‌రావు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణులు.. బాధిత కుటుంబ సభ్యులతో కలిసి ధర్నా చేశారు. ''రౌడీలకు కొమ్ము కాస్తున్న పోలీసులను వెంటనే సస్పెండ్ చేయాలి. కాంగ్రెస్ గూండాయిజం నశించాలి. ఎమ్మెల్యే పీఎస్ఆర్ రౌడీల నుంచి మంచిర్యాల ప్రజలకు రక్షణ కల్పించాలి. నేరస్తులను వెంటనే అరెస్టు చేయాలి' అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

### బీఆర్ఎస్ నాయకుల అరెస్టు.. పోలీస్‌స్టేషన్‌లో ఉద్రిక్తత

బీఆర్ఎస్వీ నాయకుడు దగ్గుల మధుపై దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలని ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. వాహనాల్లో పోలీస్ స్టేషన్‌కు తరలించాలని ప్రయత్నించారు. కానీ మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు దానికి నిరాకరించి, బెల్లంపల్లి చౌరస్తా నుంచి ర్యాలీగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. ముందు దాడికి పాల్పడిన కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేశాకే, తమను అరెస్టు చేయాలంటూ పట్టుబట్టారు. అప్పటి దాకా పోలీస్‌స్టేషన్ నుంచి కదిలేది లేదంటూ మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు, విజిత్ రావు, ఇతర నాయకులు భీష్మించుకొని కూర్చుండిపోయారు. ఇలా ఉదయం 11.30 గంటలకు మొదలైన ధర్నా పోలీస్‌స్టేషన్‌లో సాయంత్రం 4 గంటల దాకా దాదాపు ఐదు గంటల పాటు కొనసాగింది. ఈ క్రమంలో పోలీసులకు.. బీఆర్ఎస్ నాయకులకు మధ్య పలుమార్లు తీవ్ర వాగ్వాదం జరిగింది. చివరకు పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశామని, కారకులను అరెస్టు చేస్తామని హామీ ఇవ్వడంతో ఓ దశలో ధర్నా విరమించాలనుకున్నారు. కానీ దాడి చేసిన వ్యక్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గాయపడిన బీఆర్ఎస్ నాయకుడు దగ్గుల మధుపైనే ఉల్టా కేసు పెట్టారని తెలియడంతో బీఆర్ఎస్ నాయకులు మరింత మండిపడ్డారు. స్టేషన్ నుంచి బయటికి రాకుండా మరోసారి అక్కడే బైఠాయించి ధర్నా చేశారు. సాయంత్రం 4 గంటలకు మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ వచ్చి పోలీసులతో మాట్లాడారు. ఘటనపై విచారణ చేసి, కచ్చితంగా బాధ్యులపై చర్యలు తీసుకుంటామని పోలీసులు హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. అనంతరం మెడిలైఫ్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న దగ్గుల మధును పరామర్శించారు.

### ఉల్టా కేసుపై వెల్లువెత్తుతున్న విమర్శలు..

కాంగ్రెస్ పార్టీ నాయకుడు, నస్పూర్ మున్సిపాలిటీ మాజీ చైర్మన్ సుర్మిళ్ల వేణు తన కారులో మంచిర్యాలకు తీసుకువచ్చి కొట్టించారని బాధితుడు ఆరోపిస్తున్నాడు. తలకు తీవ్రగాయాలతో రక్తమోడుతున్న స్థితిలో దగ్గుల మధు ఇచ్చిన వీడియో స్టేట్‌మెంట్.. ఫిర్యాదును పోలీసులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దాడికి కారకులైన వారిని అరెస్టు చేయకపోగా.. వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఉల్టా దగ్గుల మధుపై కేసు పెట్టడం అనుమానాలకు తావిస్తున్నది. గతంలో హాజీపూర్ మాజీ ఎంపీపీపై ఇదే గంజాయి బ్యాచ్ దాడి చేసినప్పుడు సైతం పోలీసులు ఉల్టా కేసులు పెట్టి, హాస్పిటల్ నుంచే విచక్షణారహితంగా ఆయనను అరెస్టు చేసి జైలుకు పంపించారనే ఆరోపణలు ఉన్నాయి. అదే తరహాలో దగ్గుల మధుపై ఉల్టా కేసు పెట్టడంపై బీఆర్ఎస్ నాయకులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ముందు మధు ఇచ్చిన ఫిర్యాదుపై ఎఫ్ఐఆర్ చేయకుండా, దాడి చేసిన వ్యక్తులు ఇచ్చిన ఫిర్యాదుపై ఎఫ్ఐఆర్ చేయడం ఏమిటన్నది అర్థం కాకుండా పోయింది. గత కేసుల మాదిరిగానే కాంగ్రెస్ నాయకులను తప్పించి, దగ్గుల మధునే పోలీసులు అరెస్టు చేస్తారనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. పోలీసులు మాత్రం ఇరువర్గాల పిటిషన్ మేరకు కేసు నమోదు చేసినట్లు చెబుతున్నారు. కానీ మధు ఇచ్చిన ఫిర్యాదులో ఉన్న వ్యక్తులపై కేసు నమోదు చేయలేదని, వారిని కచ్చితంగా కేసు నుంచి తప్పించడానికే పోలీసులు ప్రయత్నిస్తున్నారని బీఆర్ఎస్ నాయకులు ఆరోపిస్తున్నారు. అదే జరిగితే పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.



పోలీస్‌స్టేషన్‌లో నిరసన తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు, రాష్ట్ర నాయకుడు విజిత్ రావు, కార్యకర్తలు

### పీఎస్ఆర్ గూండాయిజాన్ని ప్రోత్సహిస్తున్నారు

**- మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు**

మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు మాట్లాడుతూ పెద్ద మొత్తంలో డబ్బులు సంపాదించాలనే లక్ష్యంతో మంచిర్యాల ఎమ్మెల్యే పీఎస్ఆర్ గుండాయిజాన్ని ప్రోత్సహిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. మంచిర్యాలలో ప్రజాస్వామ్యం మట్టిగలిసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన 18 నెలల్లో అనేక మందిని వేధింపులకు గురి చేయడం, దాడులు చేయడం, తప్పుడు కేసులు పెట్టి జైలుకు పంపడం పరిపాటిగా మారిందన్నారు. జిల్లా కేంద్రంలో పోలీస్ వ్యవస్థ అధ్వానంగా మారిందన్నారు. గంజాయి బ్యాచ్‌లపై, రౌడీయిజం, గుండాయిజంపై నిఘా పెట్టకుండా విచ్చలవిడి చేస్తుంటే పోలీసులు చోద్యం చూస్తున్నారంటూ మండిపడ్డారు. గురువారం రాత్రి 8.30 గంటల సమయంలో దగ్గుల మధును కాంగ్రెస్ పార్టీ నాయకుడు, నస్పూర్ మున్సిపాలిటీ మాజీ చైర్మన్ సుర్మిళ్ల వేణు తన వాహనంలో తీసుకెళ్లి బైపాస్ రోడ్‌లోని మరో కాంగ్రెస్ నాయకుడి ఇంటి దగ్గర విచక్షణారహితంగా దాడి చేశారన్నారు. తల పగిలిపోయిందని, కంటికి తీవ్ర గాయాలయ్యాయని, ఒళ్లంతా వాతలు వచ్చేలా కొట్టారని వాపోయారు. దాడి చేసిన వారు కాంగ్రెస్ నాయకులు కావడంతో వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. దాడులు చేస్తేనే డబ్బులు వస్తాయని ఎమ్మెల్యే పీఎస్ఆర్ కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. పోలీసులు గుండాయిజాన్ని, రౌడీయిజాన్ని ప్రోత్సహిస్తే ఎమ్మెల్యే ఏకుమేకు అవుతారన్నారు. ఇప్పటికైనా మంచిర్యాల బైపాస్ రోడ్డులోని గంజాయి బ్యాచ్‌ను అరెస్టు చేసి జైలుకు పంపించాలని డిమాండ్ చేశారు. గుండాయిజాన్ని పోత్సహిస్తున్న ఎమ్మెల్యే పీఎస్ఆర్‌తో పాటు, ఆ గ్యాంగ్‌కు నాయకత్వం వహించే వ్యక్తిని విచారించి, చర్యలు తీసుకుంటేనే మంచిర్యాల ప్రశాంతంగా ఉంటుందన్నారు. దెబ్బలు తిన్న దగ్గుల మధుపైనే ఉల్టా కేసు నమోదు చేయడంపై ఆయన మండిపడ్డారు. ఎమ్మెల్యే పీఎస్ఆర్ కనుసన్నల్లోనే మంచిర్యాల పోలీస్ వ్యవస్థ పని చేస్తుందనడానికి ఇదే నిదర్శనమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గంజాయిపై ఉక్కుపాదం మోపుతామని చెప్పారని, మరి మంచిర్యాలలో గంజాయి తాగి జనాలను కొడుతుంటే ఉక్కుపాదం ఎవరిపైనా మోపుతున్నారో సమాధానం చెప్పాలన్నారు. మంచిర్యాల ప్రాంతంలో పోలీసులు పూర్తిగా ఎమ్మెల్యే పీఎస్ఆర్ కనుసన్నల్లో పనిచేస్తున్నారన్నారు. అందుకే యథేచ్ఛగా దాడులు జరుగుతున్నాయని మండిపడ్డారు. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని బాధితులకు న్యాయం చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

### మధుపై ఉల్టా కేసు పెట్టడం దుర్మార్గం

**- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్**

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆ పార్టీ నాయకులు పోలీసులను ఉపయోగించి బీఆర్ఎస్ నాయకులపై, కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకులపై, ప్రజలు, రైతులపై దౌర్జన్యం చేస్తున్నారని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఫైర్ అయ్యారు. బీఆర్ఎస్ నాయకుడు దగ్గుల మధును నమ్మించి తీసుకెళ్లి దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దెబ్బలు తిన్న మధుపైనే ఉల్టా కేసు పెట్టడం దుర్మార్గమని, దాడి చేసిన వారు చికిత్స పొందుతున్న హాస్పిటల్ ముందు రాత్రి కారులో చక్కర్లు కొడుతూ, సైరన్ మోగిస్తూ తిరుగుతుంటే పోలీసులు నిమ్మకు నీరెత్తినట్లు ప్రేక్షకపాత్ర వహించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు.

### దాడులను తీవ్రంగా ఖండిస్తున్నాం

**- బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య**

జిల్లాలో బీఆర్ఎస్ నాయకులపై వరుస దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పేర్కొన్నారు. మా ప్రభుత్వం ఉంది. మేం కొడుతాం, తిడుతాం.. ఇలాగే దాడులు చేస్తామంటే కుదరదని, ప్రజలంతా గమనిస్తున్నారన్నారు. రాబోయే కాలంలో దీనికి పదింతల మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ నాయకులు పద్ధతి మార్చుకోవాలని సూచించారు. ప్రజలు మీపై నమ్మకంతో ఓట్లు వేశారని, ఆ నమ్మకాన్ని నిలబెట్టుకొని ప్రజల మన్ననలు పొందాలన్నారు. అదీ చేయకుండా బీఆర్ఎస్ నాయకులపై దాడులు చేస్తే వచ్చే ప్రయోజనం ఏముండదని, ఇలాంటి దౌర్జన్యాలను ప్రజలు గమనిస్తున్నారని, సమయం వచ్చినప్పుడు కచ్చితంగా పాతాల లోకంలో తొక్కి బొంద పెడుతారన్నారు.

## చదువు 'కొనే'దెలా..?

- మంచిర్యాల జిల్లాలోని ప్రైవేటు స్కూళ్లలో ఇష్టారాజ్యాంగా ఫీజుల వసూళ్లు
- పుస్తకాలు, యూనిఫాంల అమ్మకాలు.. కొనాలని ఒత్తిడి
- నారాయణ పాఠశాలలో పుస్తకాలు విక్రయిస్తుండగా పట్టుకున్న విద్యార్థి సంఘాలు



మంచిర్యాలలోని నారాయణ పాఠశాల ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు(ఫైల్)

నస్పూర్, జూన్ 20 : మంచిర్యాలలోని పలు ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు నిబంధనలు తుంగలో తొక్కి ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తుండగా, విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు. వీధి విధినా ఈ టెక్నో, ఐఐటీ, ఏఐల పేరిట ప్రైవేట్ స్కూళ్లు నెలకొల్పి అడ్మిషన్లు.. మెయింటనెన్స్, స్పెషల్ ఫీజుల పేరిట యాజమాన్యాలు నిలువు దోపిడీ చేస్తున్నాయి. పుస్తకాలు, నోట్ బుక్‌లు, పెన్సిళ్లతో పాటు పాఠశాల పేర్లతో ఉన్న బ్యాగులను సైతం విక్రయిస్తూ.. తల్లిదండ్రులపై ఒత్తిడి తెస్తూ పెను భారాన్ని మోపుతున్నాయి. బహిరంగ మార్కెట్‌లో ఉన్న ధర కంటే పదింతలు పెంచి అందినకాడికి దండుకుంటున్నాయన్న ఆరోపణలుండగా, జిల్లా విద్యాశాఖ అధికారులు ఆ వైపు కనీసం కన్నెత్తి చూడడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. పాఠశాలలు ప్రారంభమై వారం రోజులు గడుస్తున్నా ఎక్కడా తనిఖీలు చేయడం లేదు.

### నారాయణ పాఠశాల ఎదుట ధర్నా

మంచిర్యాలలోని నారాయణ స్కూల్‌లో నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలను ఎక్కువ ధరకు విక్రయిస్తుండగా.. గురువారం విద్యార్థి సంఘాల నాయకులు అక్కడికి చేరుకొని ధర్నా చేపట్టిన విషయం విదితమే. ఎంఈవో మాలవిదేవి పుస్తకాల రూమ్‌ను సీజ్ చేశారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఇష్టారాజ్యంగా ఫీజులు వసూళ్లు చేయడమేగాక.. అడ్డగోలు ధరలకు పుస్తకాలు విక్రయిస్తున్నా విద్యా శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని విద్యార్థి సంఘాల నాయకులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా తనిఖీలు నిర్వహించాలని, ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నారు.



నీళ్ల ట్యాంక్ ఎక్కి నిరసన తెలుపుతున్న మత్స్యకారులు



గోపాల్, చంద్రమౌళితో ఫోన్‌లో మాట్లాడుతున్న ఏడీ అవినాశ్

## గొల్లవాగుపై హక్కులు కల్పించాలి

- ప్రాజెక్టులో అక్రమ చేపల వేటను ఆపాలి
- భీమారం గ్రామానికి చెందిన మత్స్యకారుల డిమాండ్
- పురుగుల మందు డబ్బాతో వాటర్ ట్యాంక్ ఎక్కి నిరసన
- ఏడీ హామీతో ఆందోళన విరమణ

భీమారం, జూన్ 20 : 'గొల్లవాగు ప్రాజెక్ట్‌లో చేపలు పట్టుకునేందుకు మాకే హక్కులు కల్పించాలి. ఇంతర ప్రాంతాల వారు అక్రమంగా చేపడుతున్న చేపల వేటను ఆపాలి' అంటూ భీమారంకు చెందిన మత్స్యకారులు డిమాండ్ చేశారు. కరీంనగర్, వేమనపల్లికి చెందిన మత్స్యకారులు గురువారం సాయంత్రం నుంచి శుక్రవారం ఉదయం గొల్లవాగు ప్రాజెక్టులో చేపలు పట్టడంపై భీమారంకు చెందిన మత్స్యకారులు సుంకరి గోపాల్, దాసరి చంద్రమౌళి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఉదయం 10 గంటలకు స్థానిక మంచిర్యాల – చెన్నూర్ జాతీయ రహదారి పక్కనే ఉన్న నీళ్ల ట్యాంక్‌పైకి పురుగుల మందు డబ్బాతో ఎక్కి నిరసన తెలిపారు. ఎస్ఐ శ్వేత అక్కడికి చేరుకొని వారిని కిందకు దిగాలని కోరినా వినిపించుకోలేదు. సాయంత్రం 4 గంటల వరకూ అక్కడే ఉండిపోవడంతో మంచిర్యాల ఫిషరీష్ కార్యాలయం నుంచి ఫిషరీష్ అసిస్టెంట్ శ్రావణ్ వచ్చి వారితో సముదాయించే ప్రయత్నం చేశారు. గొల్లవాగు ప్రాజెక్ట్‌లో అక్రమంగా చేపడుతున్న చేపల వేటను ఆపాలని, ఈ విషయమై కలెక్టర్ కుమార్ దీపక్‌తో పాటు మత్స్యశాఖ ఏడీ అవినాశ్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, కొంత మంది చేపలు పట్టేందుకు టెండరు వేసి రూ.33 లక్షలకు కరీంనగర్‌కు చెందిన గుత్తేదారుకు అప్పగించారని, సదరు గుత్తేదారు దాదాపు రూ. 25 లక్షల విలువ గల చేపలను కరీంనగర్ తరలించారన్నారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కలగూర రాజ్‌కుమార్‌తో పాటు సీనియర్ నాయకులు దాసరి మధునయ్య, దుర్గం లాజర్ ఫిషరీష్ బాధితులతో మాట్లాడారు. మత్స్యశాఖ ఏడీతో ఫోన్‌లో మాట్లాడించగా, ఆయన న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో వారు కిందికి దిగివచ్చారు.

## క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు ఎంపిక పోటీలు

ఆసిఫాబాద్ టౌన్, జూన్ 20 : క్రీడా పాఠశాలల్లో 2025– 26 విద్యా సంవత్సరానికిగాను 4వ తరగతిలో ప్రవేశానికి 25వ తేదీన ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్‌లలోని తెలంగాణ ప్రభుత్వ క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు మండల స్థాయి పోటీల్లో మెరిట్ సాధించిన వారికి జిల్లా కేంద్రంలోని గిరిజన క్రీడా పాఠశాల మైదానంలో పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జూలై 1 నుంచి 5వ తేదీ వరకు రాష్ట్రస్థాయి పోటీలు ఉంటాయని వివరించారు. వివరాలకు 80080 90626 నంబర్‌ను సంప్రదించాలని, అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## దరఖాస్తుల ఆహ్వానం

శ్రీరాంపూర్, జూన్ 20 : సివిల్ సర్వీసెస్ పరీక్షకు సన్నద్ధమవుతున్న తెలంగాణ ప్రాంత అభ్యర్థులకు ఆర్థిక ప్రతిబంధకాలను తొలగించాలనే ఉద్దేశంతో సింగరేణి కాలరీస్ రూపొందించిన రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం పథకాన్ని ఈ ఏడాది కూడా కొనసాగిస్తున్నట్లు సింగరేణి సీఎండీ ఎన్ బలరామ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల విడుదలై సివిల్స్ ప్రిలిమ్స్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన తెలంగాణ ప్రాంత అభ్యర్థులకు రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం పథకం కింద ఒక్కొక్కరికీ రూ లక్ష ప్రోత్సాహకాన్ని అందించేందుకు ఈ నెల 23 నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సింగరేణి సంస్థ సీఎండీ బలరామ్ పేర్కొన్నారు. గతేడాది 140 మంది ప్రిలిమ్స్ పాసైన వారికి సాయం అందించగా, ఇందులో 20 మంది మెయిన్స్‌లోనూ ఉత్తీర్ణత సాధించి ఇంటర్వ్యూలకు ఎంపికయ్యారని, ఇంటర్వ్యూలకు హాజరయ్యే వారికి మరో రూ. లక్ష సాయం కూడా అందించామని, వారిలో ఏడుగురు సివిల్స్‌లో సత్తా చాటారని తెలిపారు. అభ్యర్థులు సింగరేణి వెబ్ సైట్ www.scclmines.com ను సందర్శించి దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.